



● లిక్విడ్ గంజాయిని గుర్తించిన పోలీసులు (ఫైల్)



● అంతరపంటలో సాగు చేస్తున్న గంజాయి మొక్కలను గుర్తించిన అధికారులు (ఫైల్)



● అంతరపంటలో సాగవుతున్న గంజాయి మొక్కలు (ఫైల్)

గంజాయిపై.. నిఘా



- జిల్లాలో ప్రభుత్వ ఆదేశాలతో కదిలిన అధికార యంత్రాంగం
- క్షేత్రస్థాయిలో నిర్మూలనకు కసరత్తు
- గంజాయి సాగయ్యే గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు
- పోలీసు, ఎక్సైజ్ శాఖల సమన్వయంతో గంజాయి నిర్మూలనకు ముందుకు..
- ప్రత్యేక విభాగాల ఏర్పాటు
- గంజాయి, మత్తు పదార్థాలను విక్రయించే వారిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ అమలు
- ఇప్పటివరకు 17 మందిపై నమోదు
- జిల్లావ్యాప్తంగా దాడులు చేస్తున్నా.. ఆగని మత్తు పదార్థాల దందా

కామారెడ్డి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మత్తుగా.. గమ్మత్తుగా యువతను గంజాయి మత్తులోకి లొంగదీసుకుంటోంది. అక్రమార్జనకు అలవాటు పడిన కొందరు అక్రమార్కులు దొడ్డి దారిన గంజాయి పంటను సాగు చేస్తున్నారు. ఈ పంటకు కావాల్సిన ముడి విత్తనాలను ఎవరు అందజేస్తున్నారు? ఎక్కడి నుంచి వస్తున్నాయి? వీరికి ఎవరు ప్రోత్సాహం ఇస్తున్నారు? అధికారులకు తెలిసే సాగుచేస్తున్నారన్న అంతుచిక్కని వ్యవహారం. అయితే జిల్లాలో గాంధారి, సదాశివనగర్, రాజంపేట, తాడ్వాయి, లింగంపేట్, జుక్కల్, మద్నూర్, బాన్సువాడ, నస్రూళ్లబాద్, తదితర మండలాల్లో యథేచ్ఛగా గంజాయి పంటను అంతరపంటగా సాగు చేస్తుంటారు. గంజాయి సాగుపై ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తే తప్ప.. నియంత్రణ వైపు అధికారులు అడుగులు వేయరనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో పోలీసులు, ఎక్సైజ్‌శాఖల అధికారులు గంజాయి సాగుచేసే ప్రాంతాల్లో దాడులు చేసి రూ.లక్షల విలువ చేసే గంజాయి మొక్కలను ధ్వంసం చేశారు. ఇటీవల ప్రభుత్వం నిషేధిత మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల వినియోగంపై ఉక్కుపాదం మోపాలని యంత్రాంగాన్ని ఆదేశించారు. గంజాయి సాగు చేసే వ్యక్తులపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ నమోదు చేస్తున్నారు. అయితే, జిల్లాలో ఇప్పటి వరకు 17 మందిపై ఎన్‌డీపీఎస్ కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు పోలీసు, ఎక్సైజ్‌శాఖ అధికారులు జిల్లావ్యాప్తంగా దాడులు చేసి గంజాయి సాగును నిర్మూలించేందుకు నడుము బిగించారు.

గంజాయి విక్రయాలపై దాడులు

జిల్లాలో గంజాయి సాగు జోరుగా సాగుతోందనే సమాచారంతో.. ఎక్సైజ్, పోలీసు శాఖలు గతంలో గంజాయి సాగుచేసే ప్రాంతాలపై వరుస దాడులు చేశారు. ఈ దాడులలో భారీగానే గంజాయి సాగు మొక్కలను గుర్తించారు. జిల్లాల్లో పెద్దమొత్తంలోని గంజాయి మొక్కలను సంబంధిత శాఖ అధికారులు గుర్తించారంటే.. స్మగ్లర్లు ఏ స్థాయిలో గంజాయి సాగు చేస్తున్నారో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. గత పక్షం రోజుల కిందట బాన్సువాడ మండలంలో, పట్టణ కేంద్రాలలో గంజాయి విక్రయిస్తున్న ఓ యువకుడిని, మహిళను పోలీసులు అదుపులోకి తీసుకుని సుమారు 30కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కామారెడ్డిలో గత ఐదు నెలల కిందట పొడిగంజాయి కాకుండా లిక్విడ్ గంజాయిని పోలీసులు పెద్దమొత్తంలోనే స్వాధీనం చేసుకున్నారు. గతంలో గాంధారి మండలంలోని ధన్‌సింగ్ తండాలో 267 గంజాయి మొక్కలను గుర్తించి ధ్వంసం చేశారు. అదే మండలంలోని కొత్తబాది తండాలో పెద్ద మొత్తంలోనే గంజాయి మొక్కలను పోలీసు నిఘా వర్గాలు గుర్తించారు. కొత్తబాది తండాలో ఎకరం మొక్కజొన్న పంటలో సుమారు రెండు వేల వరకు గంజాయి మొక్కలను గుర్తించి ధ్వంసం చేశారు. అలాగే, జుక్కల్ మండలంలోని వజ్రకండిలో మొక్కజొన్న పంటలో సాగు చేస్తున్న 140 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేశారు. సదాశివనగర్‌లోని యాచారంలో పత్తిపంటలో సాగవుతున్న 114 మొక్కలను గుర్తించారు. జుక్కల్‌లోని వజ్రకండి గ్రామంలో పత్తి పంటలో సాగవుతున్న 68 గంజాయి మొక్కలను ఎక్సైజ్ పోలీసులు గుర్తించి దహనం చేశారు.

మారుమూల తండాలు, గ్రామాల్లో..

జిల్లాలోని గాంధారి, సదాశివనగర్, రాజంపేట్, రామారెడ్డి, జుక్కల్, మద్నూర్, పిట్లం, బిచ్కుంద, నస్రుళ్లబాద్ మండలలాల్లోని మారుమూల గ్రామాలు, తండాలను గంజాయి సాగుకు స్మగ్లర్లు దళారులు ఎంచుకుంటున్నారు. కొంతమంది వ్యాపారులు వానాకాలం పంటల సాగుకు ముందే ఈ ప్రాంతాలను ఎంచుకుని ఆయా గ్రామాలు, తండాలలోని రైతులతో ఒప్పందం కుదుర్చుకుని ఆరుతడి పంటలైన మొక్కజొన్న, పత్తి, కంది లాంటి పంటల్లో సాగు చేసేలా పెట్టుబడులు స్మగ్లర్లే పెడుతున్నట్లు తెలుస్తోంది. ఒక్కో మొక్కలెక్కన స్మగ్లర్లు రైతులకు డబ్బులు చెల్లిస్తున్నట్లు.. గంజాయి సాగు కు ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తోంది. స్మగ్లర్లు గుట్టుగా గంజాయి విత్తనాలను అందిస్తూ.. మూడో కంటికి తెలియకుండా ఆరుతడి పంటల్లో అంతరపంటగా అక్రమంగా సాగు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మారుమూల గ్రామాలు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు సరిహద్దులుగా ఉండడంతో.. ఇక్కడి నుంచి సాగు చేసి ఎండు గంజాయిని ఆ రాష్ట్రాల కు స్మగ్లింగ్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఎన్‌డీపీఎస్ యాక్ట్‌కు ఆదేశం

జిల్లాలో డ్రగ్స్, మాదకద్రవ్యాలైన గంజాయి, అల్ప్రాజోలం, హుక్కా, సారా వినియోగం, తయారీని నిర్మూలించాలంటూ ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసింది. గంజాయి కట్టడికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించే పనిలో పడ్డారు. అంతేకాకుండా గ్రామాల్లో గంజాయి సాగుచేసే వ్యక్తులపై అధికారులు కఠిన చర్యలు తీసుకుంటారా? లేక హడావుడి చేసి వదిలేస్తారా? అనేది వేచి చూడాలి. గంజాయి, అల్ప్రాజోలం, ఇతర మత్తుపదార్థాల దందా నిర్వహిస్తున్న వ్యక్తులపై ఎన్‌డీపీఎస్ యాక్ట్, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ప్రభుత్వం హెచ్చరించిన నేపథ్యంలో ఇవి ఎంత వరకు పని చేస్తాయని హాట్ టాపిక్‌గా మారింది. ఈ నేపథ్యంలో జిల్లాలో ఇటీవల కాలంలో మత్తుపదార్థాల దందా చేస్తున్న 17 మందిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసి కేసులు నమోదు చేశారు.

కదలిన యంత్రాంగం

మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే జిల్లాలో ఎక్కువగా గంజాయి విక్రయంతో పాటు పలు గ్రామాలు, తండాలలో మొక్కజొన్న, పత్తి, తదిత పంటలలో అంతరపంటగా గంజాయిని జోరుగా సాగు చేస్తుంటారు. ప్రధానంగా గాంధారి, సదాశివనగర్, రాజంపేట, తాడ్వాయి, లింగంపేట, జుక్కల్, మద్నూర్, బాన్సువాడ, నస్రుళ్లబాద్, తదితర మండలాల్లో గంజాయి సాగు జోరుగానే సాగుతోంది. అయితే ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలీసు, ఎక్సైజ్ శాఖలు సమన్వయంతో ఈ మండలాల పరిధిలోని గంజాయి సాగు చేసే గ్రామాలపై మరింత నిఘా పెట్టారు. ఈ గ్రామాల్లో పోలీసు, ఎక్సైజ్ శాఖల అధికారులు గంజాయి సాగుపై, వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు. ఎవరైన గంజాయి విక్రయించినా.. వినియోగించినా.. సాగు చేసిన వారిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్‌తో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు. గంజాయి నిర్మూలనపై అధికార యంత్రాంగం కదిలి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

సంక్షిప్త సమాచారం



ఎస్సైగా బాధ్యతలు స్వీకరిస్తున్న మల్లారెడ్డి

నాగిరెడ్డిపేట ఎస్సైగా మల్లారెడ్డి

నాగిరెడ్డిపేట, ఆగస్టు 5: నాగిరెడ్డిపేట ఎస్సైగా మల్లారెడ్డి సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు ఇక్కడ ఎస్సైగా పని చేసిన రాజు మెదక్ జిల్లాకు బదిలీ అయ్యారు. మెదక్ జిల్లా చేగుంటలో ఎస్సైగా పని చేసిన మల్లారెడ్డి కామారెడ్డి జిల్లాకు బదిలీపై రాఇగా, ఆయనకు నాగిరెడ్డిపేట పోలీస్ స్టేషన్‌కు పోస్టింగ్ ఇవ్వడంతో ఆయన సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు.

రైల్వే గేటు మూసివేత

రామారెడ్డి, ఆగస్టు 5: రామారెడ్డి మండలంలోని ఉప్పల్‌వాయి గ్రామంలో ఉన్న రైల్వే స్టేషన్ పక్కన గల రైల్వే గేటు మూడు రోజుల పాటు మూసివేస్తున్నట్లు రైల్వేస్టేషన్ మాస్టర్ విశ్వనాథం పేర్కొన్నారు. మంగళవారం నుంచి ఈనెల 8వరకు రైల్వేగేటు మూసివేయడం జరుగుతుందని అన్నారు. ప్రజలు గమనించి వేరే దారిలో వెళ్లాలని సూచించారు.

9న రేషన్ డీలర్ల నియామకానికి రాత పరీక్ష : ఆర్డీవో

ఎల్లారెడ్డి, ఆగస్టు 5: ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలోని లింగంపేట, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట మూడు మండలాలకు సంబంధించిన మొత్తం 8 రేషన్ డీలర్లకుగాను 72 దరఖాస్తులు వచ్చాయి. అందులో ఐదు దరఖాస్తులను తిరస్కరించగా.. 67 మందికి ఈనెల 9న ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాత పరీక్ష నిర్వహించనున్నట్లు ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన వారికి మౌళిక పరీక్ష నిర్వహించి అర్హులైన వారికి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

భిక్కనూరులో డెమో రైలు స్టాప్ ఇవ్వాలని వినతి

భిక్కనూరు, ఆగస్టు 5: భిక్కనూరులో నిజామాబాద్-కాచిగూడ మధ్యలో నడుస్తున్న డెమో రైలును భిక్కనూరు రైల్వేస్టేషన్‌లో స్టాప్(ఆపాలని) ఇవ్వాలని గ్రామ యువకులు స్టేషన్ మాస్టర్ భానుశేఖర్‌కు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం నిజామాబాద్ నుంచి కాచిగూడ వెళ్లి.. రాత్రి కాచిగూడ నుంచి నిజామాబాద్‌కు ఈ రైలు నడుస్తుందని, దీనికి భిక్కనూ రులో స్టాప్ లేదని, ఈ రైలుకు స్టాప్ ఇస్తే మండల ప్రజలకు, హైదరాబాద్, నిజామాబాద్ నుంచి వచ్చే అధికారులకు సౌకర్యంగా ఉంటుందని అన్నారు. రైల్వే అధికారులు స్పందించి డెమో రైలును భిక్కనూరుకు స్టాప్ ఇవ్వాలని కోరారు. ఇందులో హరీంద్ర, సిద్ధూ, నాగభూషణం, తరుణ్, బత్తు లహరి, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం-పచ్చదనంలో ప్రతిఒక్కరూ పాల్గొనాలి

● జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ● జిల్లావ్యాప్తంగా అవగాహన ర్యాలీలు ● పాల్గొన్న స్థానిక అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది

భిక్కనూరు, ఆగస్టు 5: ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం భిక్కనూరు మండలకేంద్రంతో పాటుగా మండలంలోని బస్వాపూర్ గ్రామంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ఎల్లప్పుడు మురికాలువలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రతిఒక్కరు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతిఒక్కరూ తమ ఇళ్లల్లో ఐదు మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామపంచాయతీ సిబ్బంది తప్పకుండా దోమల నివారణ మందును పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలందరు భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు. కాగా అన్నిగ్రామాల్లో అధికారులు అవగాహన ర్యాలీలు నిర్వహించి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఆ తర్వాత ప్రత్యేక గ్రామసభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, తహసీల్దార్ శివప్రసాద్, మండల వైద్యాధికారిణీ యేమిమా, వ్యవసాయాధికారి రాధ, భిక్కనూరు ఈవో మహేష్‌గౌడ్, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

సదాశివనగర్: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ప్రత్యేకాధికారి అశోక్‌రెడ్డి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీని సందర్శించారు. ఆ తర్వాత స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా చేసిన పనుల పురోగతిని పరిశీలించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేస్తున్న కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ ఆవరణలో మొక్కలు నాటడంతో పాటు మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో సురేందర్, మండల ప్రత్యేకాధికారి సతీష్‌యాదవ్, ఎంపీడీవో సంతోష్ కుమార్, తహసీల్దార్ గంగాసాగర్, డీఎల్‌పీవో శ్రీనివాస్, ఎంపీవో సురేందర్‌రెడ్డి, ఏఈపీఆర్ మారుతి, ఎంఈవో యోసప్, ఏపీఎం రాజిరెడ్డి, ఏపీవో మధు, ఏఈ ఇరిగేషన్ సంతోష్, ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్ శ్రీధర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మాధవీలత, తదితరులున్నారు.

గాంధారి: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం గాంధారి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి బావయ్య మాట్లాడుతూ గ్రామ పంచాయతీ నుంచి ప్రభుత్వ ఆసుపత్రి వరకు ర్యాలీ అవగాహన ర్యాలీ చేపట్టామన్నారు. ఇందులో ఎంపీడీవో రాజేశ్వర్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, ఏపీఎం గంగారాజు, సీసీ రాజు, ఏఎన్ఎం, ఆశలు, మాజీ ఎంపీటీసీ తూర్పురాజు, తదితరులున్నారు.



ఎల్లారెడ్డిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



డోంగ్లిలో పాల్గొన్న అధికారులు, గ్రామస్థులు

రాజంపేట: రాజంపేట మండలకేంద్రంతో పాటు గ్రామాలలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి అపర్ణ మాట్లాడుతూ ఈనెల 5 నుంచి 9 వరకు మండలంలోని గ్రామాలల్లో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశం, ఎంపీవో రఘురాం, పంచాయతీ కార్యదర్శి అశోక్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



భిక్కనూరులో ర్యాలీలో పాల్గొన్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

దోమకొండ: మండల కేంద్రంలోని బాలికల పాఠశాల ముందు సోమవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా రోడ్డు ఊడ్చి శ్రమదానం చేశారు. గ్రామంలో ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు వ్యాస రచన పోటీలు, బస్టాండ్ ఆవరణలో శానిటేషన్ కార్యక్రమం నిర్వహించారు. రైతు వేదిక వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల ప్రత్యే అధికారి భాగ్యలక్ష్మీ, మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్: మండలంలోని అన్ని గ్రామ పంచాయితీలలో సోమవారం స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించారు. బీర్కూర్ గ్రామ పంచాయితీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ లత మాట్లాడారు. కార్యక్రమంలో ఏ రోజు ఏఏ కార్యక్రమాలు చేపడతారనే వివరాలను ఆమె వివరించారు. ఇందులో గ్రామ పంచాయితీ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు, ఐకేపీ సీసీలు పాల్గొన్నారు.

మద్నూర్: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని డోంగ్లి, మద్నూర్ తహసీల్దార్ పిలుపునిచ్చారు. ఉమ్మడి మద్నూర్, డోంగ్లి మండలాల్లో ర్యాలీలను నిర్వహించి ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇందులో తహసీల్దార్ ముజీబ్, ఎంపీడీవో రాణి, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని మండలంలో ఘనంగా ప్రారంభించారు. ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్, మున్సిపల్ ప్రత్యేక అధికారి నీటి పారుదల శాఖ డి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు అధికారులు, ప్రజాప్రతినిధులు మహిళా సంఘాల సభ్యులు పోలీసులు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఇందులో డీఎస్పీ శ్రీనివాసులు, డీఈ నారాయణ, కౌన్సిలర్లు పద్మ, శ్రీకాంత్, రాము, ఐసీడీఎస్ సీడీపీవో సరిత, నాయకులు శ్రీనివాస్, విద్యాసాగర్, తదితరులున్నారు.



గాంధారిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



రాజంపేటలో అవగాహన ర్యాలీలో పాల్గొన్న అధికారులు, గ్రామస్థులు



దోమకొండలో రోడ్డు ఊడుస్తున్న అధికారులు, స్థానికులు

అధికారుల నిర్లక్ష్యం..రుణమాఫీకి నోచుకోని 73మంది రైతులు

● లింగంపేటలో ఏవోకు ఫిర్యాదు చేసిన రైతులు

లింగంపేట, ఆగస్టు 5: లింగంపేట సహకార సంఘంలో రుణాలు తీసుకున్న 73మంది రైతులకు సంఘం అధికారుల నిర్లక్ష్యం కారణంగా రుణమాఫీ పొందలేకపోయరు. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం 2023 డిసెంబరు 9కి ముందు రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీ చేస్తున్నట్లు ప్రకటించింది. మండలంలోని లింగంపేట సహకార సంఘంలో 73మంది రైతులు రుణాలు సెప్టెంబరు, అక్టోబరు నెలలలోనే రుణాలు తీసుకున్నప్పటికీ అధికారులు వారి రుణాలను జనవరి, ఫిబ్రవరిలో తీసుకున్నట్లు ఆన్‌లైన్ చేశారు. దీంతో రైతులు తీసుకున్న రూ.49లక్షల68వేలు రుణమాఫీకి నోచుకోలేదు. రైతులు కార్యాలయాల చుట్టు తిరిగి చివరికి సోమవారం రైతులు తమ సమస్య పరిష్కరించి తమకు రుణమాఫీ జరిగేవిధంగా చూడాలని ఏవోకు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో మరో 20 సొసైటీలలోనూ ఇలాంటి సమస్య ఉన్నట్లు తెలిసింది. దీనిపై సీఈవో సందీప్‌ను వివరణ కోరగా.. అప్పట్లో రైతులకు సంబంధించి ఆన్‌లైన్ సమస్యలు వచ్చాయని, దీంతో ఆన్‌లైన్ చేయడం ఆలస్యమైందని ఆయన తెలిపారు. ఈ విషయాన్ని అప్పట్లోనే డీసీసీబీ అధికారులకు తెలియజేశామని ఆయన తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించి తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.



● లింగంపేటలో ఏవోకు ఫిర్యాదు చేస్తున్న రైతులు



అర్హులకు డబుల్ బెడ్‌రూమ్‌లను అందించాలి

బోధన్‌రూరల్, ఆగస్టు 5: మండలంలోని అమ్దాపూర్ గ్రామంలో నిర్మించి ఖాళీగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులైన వారికి కేటాయించాలని సోమవారం గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. కొంతమంది గ్రామస్థులు నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలోకి వెళ్లి సాయంత్రం వరకు అక్కడే ఉండిపోయారు. ఎవరు రాకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. గ్రామంలో నిర్మించిన డబుల్‌బెడ్‌లు నిరుపయోగంగా ఉన్నాయని అర్హులైన వారికి కేటాయించాలని వారు కోరారు.

ఎస్సారెస్పీలోకి 16వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మెండోర, ఆగస్టు 5: మహారాష్ట్ర విష్ణుపూరి, బాలీగావ్ ప్రాజెక్టుల నుంచి భారీగా మిగులు జలాలను దిగువకు కొనసాగుతుండడంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద వచ్చి చేరుతుందని ప్రాజెక్టు ఈఈ చక్రపాణి తెలిపారు. గోదావరి పరివాహక ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో ప్రాజెక్టులోకి 16229క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుందన్నారు. ఉదయం ప్రాజెక్టులోకి 15418క్యూసెక్కుల వరద రాగా మధ్యాహ్నం 13167క్యూసెక్కులకు వరద తగ్గింది. దీంతో సాయంత్రం వరద కాస్త పెరిగి 16వేల క్యూసెక్కులకు పెరిగింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091.00అడుగులు (80.5 టీఎంసీ)లు కాగా సోమవారం సాయంత్రానికి 1080.1అడుగులు (45.161 టీఎంసీ)ల నీటి నిల్వ ఉందని ఎస్సారెస్పీ అధికారులు తెలిపారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ


మోస్రా, ఆగస్టు 5: మోస్రా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం జిల్లా క్షయ నిర్మూలన అధికారి దేవి నాగేశ్వరి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక కేంద్రానికి వచ్చిన ప్రతీ ఒక్కరిని టీబీ లక్షణాలు గురించి అడగాలని ఎవరైనా దగ్గుతో బాధ పడుతున్నట్లయితే వెంటనే తెమడ నమూనాలను సేకరించి పరీక్షలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్య అధికారి విజయ్ కుమార్, జిల్లా టీబీ కోఆర్డినేటర్ రవి గౌడ్, ఘనరాజ్, సూపర్‌వైజర్ సాయమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

నికాల్‌పూర్‌లో దొంగల హల్‌చల్

డొంకేశ్వర్, ఆగస్టు 5: మండలంలోని నికాల్‌పూర్ గ్రామంలో దొంగలు హల్‌చల్ చేశారు. ఆదివారం తెల్లవారుజామున దొంగలు మూడు ఇళ్లు, ఒక్క బెల్టుషాపుల్లో చోరీకి పాల్పడ్డారు. ఓ వ్యక్తి ఇంట్లోకి చొరబడి నగదును ఎత్తుకెళ్లారు. మిగతా రెండు ఇళ్లలో చోరీకి యత్నించగా ఏమి దొరకకపోవడంతో వెనుతిరిగారు. మద్యం షాపుల్లో మద్యాన్ని దొంగలించారు. మత్తులో ఉన్న దొంగ ఊరచివర పడిపోయి ఉండాన్ని గమనించిన స్థానికులు అనుమానం వచ్చిన గ్రామస్థులు అతడిని విచారించగా ముగ్గురు గ్రామంలో దొంగతనానికి పాల్పడినట్టు ఒప్పుకున్నాడు. దీంతో స్థానికులు పోలీసులకు అప్పగించారు.

























బోధన్ ఏకచక్రేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



శివాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న పురోహితులు

బోధన్‌రూరల్,ఆగస్టు5: బోధన్ పట్టణంలోని ఏకచక్రేశ్వరాలయంలో శ్రావణ మాసం మొదటి సోమవారం పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు గణేష్ మహరాజ్ శ్రావణ మాసం విశిష్టతను భక్తులకు వివరించారు. శ్రావణ మాసం మొదటి రోజు సోమవారం రావడం సోమవారం శివుడికి మహ ప్రీతిదాయకమైన రోజు అని శ్రావణ మాసంలో ఐదుసార్లు శ్రావణ సోమవారాలు వస్తాయని, ప్రజలు నిష్ఠగా ఉంటు ఉపవాసాలు చేస్తే సకల శుభాలు కలుగుతాయన్నారు. అనంతరం శ్రావణ మాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు హరికాంత్ చారి, కమిటీ నిర్వాహకులు, వేద పండితులు, తదితరులు పాల్గొన్నారు.

● సిద్ధులగుట్టపై శ్రావణమాసం ప్రత్యేక పూజలు

పెర్కిట్: పట్టణంలోని నవనాథ సిద్ధులగుట్టపైకి శ్రావణమాసం మొదటి సోమవారం సందర్భంగా భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచే అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నందీశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లకీ సేవలో భక్తులు భక్తిగీతలు ఆలపిస్తూ పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ పి. వినయ్‌రెడ్డి కాంగ్రెస్ నాయకులు సిద్ధులగుట్టపై శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన నవగ్రహాల మందిరం, భక్తుల సౌకర్యార్థం రెండు కాటేజీల నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నప్రసాదాన్ని భక్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు డి.సుమన్, పీసీగంగారెడ్డి, కొడిగెల మల్లయ్య, చరణ్‌రెడ్డి, జిమ్మిరవి, ప్రశాంత్ గౌడ్, బోండ్ల ఆనంద్, చెందేసి శ్రీనివాస్, కొంతం మురళి, బోండ్ల సంతోష్, అజారి సతీష్, బట్టు శంకర్, అలిశెట్టి నరేష్, రామాగౌడ్, సిద్ధులగుట్ట సేవ సమితి సభ్యులు, భజన మండలి సభ్యులు, మహిళ భక్తులు పాల్గొన్నారు.

కోటగిరి: కోటగిరి ఉమ్మడి మండలంలో సోమవారం శ్రావణ మాసం ప్రారంభం సందర్భంగా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని అడ్కాస్‌పల్లి లింగమయ్య, కారేగాంలోని మహ దేవుని ఆలయం, పొతంగల్, ఎత్తొండ శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు



నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

బోధన్‌రూరల్,ఆగస్టు5: నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు ప్రభుత్వం నిధులు కేటాయించి యుద్ధ ప్రతిపాదికన చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు డిమాండ్ చేశారు. సోమవారం బోదన్ నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ గేటు ఎదుట సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు నిజాంషుగర్స్‌ఫ్యాక్టరీని ప్రభుత్వ అధీనంలోకి తీసుకుని నడిపిస్తామని హామీ ఇచ్చి వాటిని విస్మరించారని, ఫలితంగా గత ప్రభుత్వాలు ఈ ప్రాంతంలో ఉన్న రైతులను, కార్మికులకు మాయమాటలు చెప్పి నమ్మించి అధికారంలోకి వచ్చారు తప్ప ఫ్యాక్టరీ పునరుద్ధరణకు చర్యలు చేపట్టకపోవడంతో తీవ్రంగా నష్టపోయారన్నారు. గత 8సంవత్సరాలకు పైగా ఇందులో పని చేసిన కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా లేఆఫ్ ప్రకటించడంతో అనేక మంది కార్మికులు అర్ధకలికి గురైన ఆర్థిక ఇబ్బందులతో అనారోగ్యాల పాలై ప్రాణాలు కోల్పోయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు బడ్జెట్‌లో కేటాయించలేకపోయాడని విమర్శించారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని, ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం ఫ్యాక్టరీ తెరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా నాయకులు శంకర్ గౌడ్, వెంకటేష్, ఏశాల గంగాధర్, నన్నేసాబ్, గంగాధరప్ప, కుమారస్వామి, గోపి, గంగాధర్, తదితరులున్నారు.

ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయాలని ధర్నా



కమ్మర్‌పల్లిలో ధర్నా చేస్తున్న మాస్‌లైన్ నాయకులు

కమ్మర్‌పల్లి, ఆగస్టు 5: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు ఆరుగ్యారెంటీ పథకాలను అమలుపర్చాలని డిమాండ్ చేస్తు సోమవారం కమ్మర్‌పల్లి మండల తహసీల్దార్ కార్యాలయం ముందు సీపీఐఎంల్ మాస్ లైన్(ప్రజాపంథ) నాయకులు ధర్నా చేపట్టారు. నిరుపేదలు ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, ఇండ్లు తదితర అనేక సమస్యల పరిష్కారం కోసం ఎల్లతరబడి ఎదురు చూస్తున్నారని, హామీలిచ్చిన గత ప్రభుత్వాలు వారిఆశాలపై నీల్లుజల్లారని ప్రస్తుత ప్రభుత్వంపై నిరుపేదలు కోటిఆశాలు పెట్టుకున్నారని వీరి బాదలను ఇప్పటికైనా అర్థంచేసుకుని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు పర్చాలని డిమాండ్ చేశారు. అర్హులైనవారందరికి రేషన్ కార్డులు, ఇండ్ల స్థలాలు, డబుల్‌బెడ్‌రూంలు, పెన్షన్‌లు ఇవ్వాలని, రైతాంగ రుణాలు రద్దుచేసి అర్హులైన వారందరికి కొత్తగా రుణాలు అందజేయాలని, సాగుదారులందరికి రైతుభరోసా పథకం వర్తిప జేయాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేయాలని, ధరణి సమస్యలు తక్షణమే పరిష్కరించి రైతులను ఆదుకోవాలని, వ్యవసాయ కార్మికులకు రూ.12 వేల జీవనభృతి అంజేయాలని, భవన నిర్మాణ, అసంఘటిత, కాంట్రాక్ట్ కార్మికులకు సెలవులతతో కూడిన కనీస వేతనాలు అమలు పర్చాలని, స్కాలర్‌షిప్, ఫీజ్ రియింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ పథకాల బకాయిలు చెల్లించాల,నిరుద్యోగ ఖాళీలపై స్వేతపత్రం ప్రకటిస్తూ జాబ్ క్యాలండర్ విడుదలచేయాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అదనపు ఆర్‌ఐ గంగారాంకు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐఎంల్ మాస్ లైన్(ప్రజాపంథ) నాయకులు సారాసురేష్, అశోక్‌కిషన్ సత్యనారాయణ, రాజేశ్వర్, గంగాధర్, మహమ్మద్, దోస్తలీ, ఎం.సురేష్, కిషన్ తదిరులు పాల్గొన్నారు.

రుణమాఫీ కాలేదని కల్లూర్‌లో రైతుల ఆందోళన



కల్లూర్‌లో ఆందోళన చేస్తున్న రైతులు

కోటగిరి,ఆగస్టు5: ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించిన అధికారుల తప్పిదాలతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆందోళనకు దిగారు. పొతంగల్ మండలంలోని కల్లూర్ గ్రామంలో కెనరా బ్యాంకు, పంచాయతీ కార్యాలయం ఎదుట సోమవారం రైతులు ధర్నా నిర్వహించారు. రెండు విడతల్లో సుమారు 50మంది రైతులు రుణమాఫీ అర్హత సాధించలేకపోయారు. ఆధార్ కార్డులలో బ్యాంకు ఖాతాలలో ఒకే రకమైన పేర్లు లేకపోతే తమ తప్పిదమా అని రైతులు ప్రశ్నించారు. రుణాలు ఇచ్చే సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేవని మాఫీ సమయంలో తమను ఇబ్బందులకు గురి చేయడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. కెనరా బ్యాంకులో అధికారులను ఈ విషయమై నిలదీశారు. విషయం తెలుసుకున్న ఏవో శ్రీనివాస్ రావు ఘటన స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. రుణమాఫీ అర్హత సాధించని రైతుల జాబితాను ఉన్నతాధికారులకు పంపించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు శాంతించారు. ఈ కార్యక్రమంలో వెంకట్ రెడ్డి, పీరుగొండ, గంగారాం, సాయిలు, మధుకర్, హన్మాండ్లు, సాయబోయి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌తో రాయకూర్ గ్రామస్థుల వాగ్వాదం

● తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

రుద్రూరు, ఆగస్టు 5: ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ లేకుండానే పట్టా మార్పిడి చేయడంపై రుద్రూరు తహసీల్దార్ వెంకటేశ్వర్లుపై రాయకూర్ గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం వ్యక్తంచేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట కుటుంబ సభ్యులు రాయకూర్ గ్రామస్థులతో ఆందోళన చేపట్టారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రాయకూర్ గ్రామానికి చెందిన కుర్మ అబ్బయ్య అనే వ్యక్తికి తల్లితో పాటు ముగ్గురు సోదరీణులు ఉన్నారు. ఇటీవల తల్లి మృతి చెందింది. అయితే అబ్బయ్య తల్లి పేరు మీద ఉన్న 22 గుంటల పట్టా భూమిని తన సోదరీమణులకు ఇస్తానని గ్రామస్థులందరి ముందు ఒప్పంద పత్రం రాసి ఇచ్చాడు. రాసి ఇచ్చిన 15 రోజులలోనే తహసీల్దార్ వద్దకు వెళ్లి సోదరీమణులకు ఇస్తానన్న భూమిని తన పేరున పట్టా చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న ఆడ బిడ్డలు గ్రామస్థులతో కలిసి అబ్బయ్యను నిలదీయగా ఇచ్చేదేమి లేదన్నాడు. తహ సీల్దార్ వెంకటేశ్వర్లు కనీసం కుటుంబ సభ్యులు ధ్రువీకరణ పత్రం లేకుండా ఎలా పట్టా చేస్తారని తహసీల్దార్‌ను నిలదీశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పొరపాటున జరిగిందని, పట్టా కాకుండా హోల్డ్‌లో పెట్టి ఆ వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదు చేయిస్తానని చెప్పడంతో బాధితులు ఆందోళన విరమించారు. సమస్య పరిష్కారం కానియేడల మళ్లీ తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని బాధితులు, రాయకూర్ గ్రామస్థులు హెచ్చరించారు.

జీవన భృతి అందించాలని ధర్నా

నవీపేట,ఆగస్టు5: నెలకు రూ.4వేల చొప్పున తమకు జీవన భృతిని అందించాలని కోరుతూ సోమవారం మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట బీడీ కార్మికులు ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు చేయూత పథకం ద్వారా తమకు రూ.4వేల చొప్పున జీవన భృతి అందించాలని వారు డిమాండ్ చేశారు. తమతో పాటు ప్యాకర్లు, నెలసరి ఉద్యోగులు, బీడీ కమీషన్‌దారులకు సైతం జీవన భృతిని అందించాలని వారు కోరారు. అనంతరం తహసీల్దార్ నారాయణకు వినతిపత్రం సమర్పించారు. అంతకు ముందు మండల కేంద్రంలో బీడీ కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు డీ.రాజేశ్వర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు

కోటగిరి,ఆగస్టు5: మధ్యాహ్న భోజన అమలు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని సర్వశిక్ష అభియాన్ ఏఎంవో జీవన్ హెచ్చరించారు. కోటగిరి మండలంలోని కొత్తపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం ఏఎంవో తనిఖీ చేశారు. విద్యార్థులకు కారంతో కూడిన భోజనం పెట్టిన విషయం తెలిసిందే. మరోమారు ఇలాంటి చర్యలు పునరావృతం కారాదని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మధ్యాహ్న భోజనాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఆయన వెంట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, రావు, ఉపాధ్యాయులు విజయ్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుండా వాహనం నడపొద్దు

మోస్రా,ఆగస్టు5: మండలంలోని మోటాడిరెడ్డి కల్యాణ మండపం వద్ద ఉమ్మడి వర్ని మండల ఎస్ఐ కృష్ణకుమార్ వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని వాహనానికి ఇన్సూరెన్స్ ఉండాలని, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని లేని యెడల జరిమాన విధించి జైలుకు పంపుతామని హెచ్చరించారు. చిన్న పిల్లలతో ఏదేని పని నిమిత్తం ద్విచక్ర వాహనాలపై పంపిన తల్లిదండ్రులపై కేసులు చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐతో పాటు కానిస్టేబుల్, సిబ్బంది పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

బోధన్‌రూరల్,ఆగస్టు5: బోధన్ మండలంలోని అమ్దాపూర్ గ్రామంలో ఎస్సీ వర్గీకరణలో సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకుల సమక్షంలో ఎస్సీ వర్గీకరణకు మద్దతుకు నిలిచిన నరేంద్ర మోదీ, మాదిగ రిజర్వేషన్‌ల కొరకు సుదీర్ఘ పోరాటం చేసిన మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేడి పాపన్నకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు విద్యాసాగర్, బీజేపీ నాయకులు సిర్ప సుదర్శన్, ఎమ్మార్పీఎస్ నాయకులు, దళిత సోదరులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శిశువుకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరం

● సీడీపీవో జానకమ్మ



చిన్నారికి అన్న ప్రాసన చేస్తున్న సీడీపీవో

రుద్రూరు, ఆగస్టు 5: నవజాత శిశువు ఆరోగ్యంగా పెరగడానికి తల్లిపాలు ఎంతగానో శ్రేయస్కరమని స్త్రీ శిశు సంక్షేమ శాఖ సీడీపీవో జానకమ్మ పేర్కొన్నారు. సోమవారం తల్లిపాల వారోత్సవాలలో భాగంగా రుద్రూరు మండల కేంద్రంలోని సమీకృత కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని చిన్నారులకు అన్న ప్రాసన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తల్లి పాలలో వివిధ రకాల పోషకాలు ఉంటాయని, అవి శిశువు పెరుగుదలకు ఉపకరిస్తాయని, అనారోగ్య సమస్యలు రాకుండా ఉంటుందన్నారు. ప్రతి మహిళ తమ శిశువులకు తల్లిపాలు ఇవ్వాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలోకి వచ్చే చిన్నారులకు తల్లిపాల వారోత్సవాల పట్ల కలిగే లాభాలపై తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ డీవో సురేష్ బాబు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ సూపర్ వైజర్ శ్రీలత, పీహెచ్‌సీ వైద్యురాలు అయేషా సిద్దికా, ఏపీఎం భా స్కర్, సూపర్ వైజర్లు రవి, సుమతి, పలు గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, చిన్నారుల తల్లిదండ్రులు. బాలింతలు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని మహంతంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్‌లు శివరాజవ్వ, శకుంతల, పద్మ, సునంద, స్వప్న తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

బోధన్‌రూరల్: తల్లిపాలే బిడ్డకు చాలా శ్రేయస్కరమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు గంగావేణి, గోపిలక్ష్మి అన్నారు. సోమవారం బోధన్ మండలంలోని హున్స, అమ్దాపూర్‌తో పాటు పలు గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల యొక్క ప్రాధాన్యత, ముర్రుపాలు తాగించడం వల్ల బిడ్డకు కలిగే ప్రయోజనాలను వివరించారు. 7నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంగామణి గంగాధర్, గ్రామ కార్యదర్శి శ్రీనివాస్, ఏఎన్ఎం గంగామణి, లావణ్య, రాధ, కమల, అంగన్‌వాడీ టీచర్‌లు జయలక్ష్మి, సుశీల, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి

● అర్హులైన వారికి డబుల్ బెడ్ రూమ్‌లు కేటాయించాలి



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,ఆగస్టు5: ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలంటూ సోమవారం బోధన్ పట్టణంలోని మహాలక్ష్మి ఆలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిలచారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు మల్లేష్ మాట్లాడుతూ బీడీ కార్మికులు కటాఫ్ డేట్ నిబంధన మూలంగా నష్టపోతున్నారని అర్హులైన వారందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాలు ఉన్న వారికి ఇళ్లు కట్టుకోవడానికి రూ.10 లక్షల ప్రభుత్వం ఉచితంగా అందజేయాలన్నారు. రేషన్ కార్డ్ లేని వారిందరికీ రేషన్ కార్డు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీఈలు అమలయ్యేంత వరకు ప్రజల పక్షాన నిరంతరం పోరాటం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పడాల శంకర్, ఈర్షద్, సీహెచ్.గంగారాం, శంకర్, సాయిలు, నాగమణి, బీపాషా బేగం, లక్ష్మిబాయి, బాబుమియా, మోహన్, అరుణ్ యాదవ్, సలీం, ప్రజాసంఘాల నాయకులు, బీడీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోధన్ ఆర్టీసీ ఆవిర్భావ దినోత్సవం



బోధన్‌డిపో ఆవిర్భావ సందర్భంగా కేక్ కట్ చేస్తున్న సిబ్బంది

బోధన్‌రూరల్,ఆగస్టు5: బోధన్ ఆర్టీసీ డిపో ఆవిర్భావ వేడుకలను సోమవారం ఆర్టీసీ డిపో ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డిపో మేనేజర్ సరిత దేవి కేక్ కట్ చేసి ఆవిర్భావ వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1985 ఆగస్టు 5వ తేదీన ప్రారంభించిన బోధన్ డిపో నాటి నుంచి నేటి వరకు దినదినాభివృద్ధి చెందుతూ ప్రయాణికులకు వారి వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చడంలో బోధన్ డిపో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. పల్లె, పట్టణ ప్రజలకు ప్రయాణ సేవలను అందిస్తూ ప్రయాణికుల మన్ననాలను పొందుతుందన్నారు. ఉద్యోగులు నిబద్ధతతో పని చేసి డిపోను మరింత అభివృద్ధి బాటలో ముందుకు నడిపించాలని సూచించారు. ప్రయాణికులకు సురక్షితమైన రవాణా సంస్థగా ఆర్టీసీ పని చేస్తుందన్నారు. ప్రజలు ఆర్టీసీ ఆదరించాలని మరిన్ని ఎక్కువ సేవలు అందించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డిపో సీఐ జనాభాయ్, సిబ్బంది లక్ష్మణ్, సూపరిండెంట్ గిరి, భూషణ్, ఏడీసీ రాణి, సూపర్‌వైజర్‌లు, డ్రైవర్‌లు, కండక్టర్‌లు, మెకానిక్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏర్గట్లలో సృజనాత్మకత సాహిత్య కార్యశాల



ఏర్గట్లలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు కృష్ణచారి

ఏర్గట్ల, ఆగస్టు 5: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం గరిపెల్లి ట్రస్ట్ అలాగే పత్తిపాక ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఎంపిక చేయబడిన 30 పాఠశాలల్లో సృజనాత్మకత సాహిత్య కార్యశాల ఏర్పాటు చేశారని అందులో భాగంగా ఏర్గట్ల పాఠశాలలో ప్రారంభించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణచారి తెలిపారు. విద్యార్థుల్లో మేధాశక్తికి పెంపొందించడానికి ఈ కార్యశాల ఎంతో ఉపయోగపడు తుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలు పండితులు ప్రవీణ్ శర్మ, గంగాధర్, ప్రసాద్, జ్యోతి పాల్గొన్నారు.

కేజీబీవీలో విద్యార్థులకు వైద్య పరీక్షలు

ఏర్గట్ల, ఆగస్టు 5: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో సోమవారం ప్రాథమిక కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు మెడికల్ ఆఫీసర్ ప్రసన్న ప్రియ వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం సమస్యలు ఉన్న విద్యార్థులకు మందులను అందజేసి పాఠశాలలోని వంటి గదిని పరిసరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్‌వో సంధ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఉపాధిహామీ సామాజిక తనిఖీ

రుద్రూరు, ఆగస్టు 5 : రుద్రూరు మండలంలో సోమవారం ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రారంభించారు. ఈ సామాజిక తనిఖీలో భాగంగా డీఆర్‌పీ రాజు చిక్కడ్‌పల్లి గ్రామంలో పర్యటించి ఇంటింటికి తిరుగుతూ ఉపాధిహామీ కూలీలతో మాట్లాడి వివరాలను సేకరించారు. ఉపాధిహామీ కూలీలు తాము చేసిన పనికి సరిపడా కూలీ వచ్చిందా లేదా అనే విషయాలను ఈ సందర్భంగా అడిగి తెలుకుంటున్నారు. వారం రోజుల పాటు ఈ సామాజిక తనిఖీ నిర్వహించడం జరుగుతుందన్నారు.

సీజ్ చేసిన ఇసుక వేలం

కోటగిరి,ఆగస్టు5: పొతంగల్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ మల్లయ్య ఆధ్వర్యంలో ఇసుక వేలంపాట నిర్వహించారు. మండలంలోని హంగర్గ గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన 16ట్రిప్పుల ఇసుకను రెండు రోజుల క్రితం సీజ్ చేశారు. ఇసుక వేలంపాటలో ముగ్గురు పాల్గొని 6 వేల రూపాయల దయాకర్ అనే వ్యక్తి దక్కించుకున్నారు. వేలంలో దక్కించుకున్న ఇసుకను త్వరితగతిన తరలించాలని తహసీల్దార్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు అదుపుతప్పిన కారు

● పలువురికి స్వల్ప గాయాలు

ఖిల్లా, ఆగస్టు 5: నగరంలోని రెండో టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో వర్నిరోడ్డులో ప్రమాదవశాత్తు కారు టైరు పగులడంతో కారు ఇంట్లోకి చొరబడింది. ఈ ఘటనలో ఇంట్లో ఉన్న పలువురికి స్వల్పగాయాలు అయ్యాయి. స్కూటీ ధ్వంసమైంది. సిరాజ్ అనే వ్యక్తి ఓ శుభకార్యానికి వెళ్లి నాగారం వైపు నుంచి వస్తుండగా ప్రమాదవశవాత్తు కారు ముందటి టైరు పేలింది ఈ ఘటనలో కారు అదుపు తప్పింది. బాధితుడు మల్లేషం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎల్.రామ్ తెలిపారు.

వీధి కుక్కల దాడిలో ఒకరికి గాయాలు

ఎడపల్లి, ఆగస్టు 5:మండలంలోని పోచారం గ్రామంలో సోమవారం గ్రామానికి చెందిన జక్కు వెంకన్న అనే వ్యక్తిని తన ఇంటి ముందే వీధి కుక్కలు ఒక్క సారిగా మీద పడడంతో ఆయన చేతికి తీవ్ర గాయాలు అయ్యాయి. రెండు రోజుల క్రితం గ్రామానికి చెందిన రెండు మేకలను కూడా వీధి కుక్కలు చంపాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. పోచారం గ్రామం చుట్టు పక్కల గుట్టలు ఉండడంతో వేరే గ్రామాల నుంచి కుక్కలను పట్టుకుని, తీసుకు వచ్చి గుట్టలలో విడిచి పెడుతున్నారని అవి మా గ్రామంలోకి వచ్చి దాడులు చేస్తున్నాయని గ్రామస్థులు తెలిపారు. ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి గ్రామంలో ఉన్న వీధి కుక్కల బారినుంచి గ్రామస్థులను,జీవాలను కాపాడడానికి చర్యలు తీసుకోవాలని వీడీసీ సభ్యులు కోరారు.



బాన్సువాడలో రోడ్లను శుభ్రం చేస్తున్న ఆర్డీవో రమేష్ రాథోడ్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

బాన్సువాడ, ఆగస్టు 5: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని తాడ్కోల్ గ్రామంలో మండల ప్రత్యేక అధికారి ఆర్డీవో రమేష్ రాథోడ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం ముఖ్య ఉద్దేశం గ్రామంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటుగా పర్యావరణాన్నిపరిరక్షించేందుకు ప్రతీఒక్కరు పాటుపడాలన్నారు. ఈ మేరకు గ్రామంలోని రోడ్లను శుభ్రం చేశారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాన్సువాడ పురపాలక పరిధిలో గల 3, 4వ వార్డుల లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజు, మాజీ డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి హాజరై ఇంటింటికి మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గంగాధర్, కమీషనర్ శ్రీహరి రాజు, తహసీల్దార్ వరప్రసాద్, పంచాయితీ కార్యదర్శి ప్రశాంతి, ఏపీఎం పద్మ, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

● కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం

బిచ్కుంద: రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని అందరం కలిసి విజయవంతం చేద్దామని బిచ్కుంద గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి తహసీల్దార్ సురేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఐదు రోజుల పాటు చేపట్టబోయే కార్యక్రమంపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటిచుట్టు పక్క ప్రాంతాలలో గుంతలలో మురికినీటిని తొలగించి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అపరిశుభ్రతతో దోమలు వ్యాపించి వ్యాధుల భారీన పడతారని తెలిపారు. ఐదురోజుల పాటు కార్యక్రమాలను అశ్రద్ధ చేయకుండా చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నిజాంసాగర్, ఆగస్టు 5: అచ్చంపేట యంపీపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు పచ్చదనం పరిశుభ్రతపై కార్యదర్శి తుకారాం వ్యాసరచన పోటీ నిర్వహించారు. ఈ సందర్బంగా లహరిక 5వతరగతి మొదటి బహుమతి, హిమబిందు 4వ తరగతి రెండవ బహుమతి గెలుపొందగా, విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కారోబార్ శివకుమార్ 1వ తరగతి విద్యార్థులకు పలకలను పంపిణీ చేశారు.



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు

'రైతులను మోసం చేసిన చెరకు ఫ్యాక్టరీపై చర్యలు తీసుకోవాలి'

కామారెడ్డి టౌన్, ఆగస్టు 5: చెరకు రైతుల పేరుతో యూనియన్ బ్యాంకులో క్రాప్‌లోను తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం చేసిన రుణమాఫీలను కూడా కాజేసిన గాయత్రీ షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం నుంచి మొత్తం రికవరీ చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ప్రభాకర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదాశివనగర్ మండలంలో ఉన్నటువంటి గాయత్రీ షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం రైతులకు సంబంధం లేకుండా రైతుల పేరిట మోసపూరితంగా నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని యూనియన్ బ్యాంకులో రుణాలు తీసుకోవడం దారుణమని అన్నారు. రైతులను మోసం చేసినటువంటి గాయత్రీ షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యంపై.. అదేవిధంగా రైతులకు సంబంధం లేకుండా గాయత్రీ షుగర్ యాజమాన్యానికి రుణాలు ఇచ్చినటువంటి ఆనాటి బ్యాంక్ అధికారులు ఎవరున్నా.. వారిపై చటరీత్యా చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతులు చెరకు విత్తే సందర్భంగా ఫ్యాక్టరీ వద్ద విత్తనాలు, ఎరువులు తీసుకుని ధర నిర్ణయం ఒప్పందం చేసుకునే విషయాలు చెప్పి భూమి పాస్‌బుక్ జీరాక్స్ తీసుకుని రైతులతో సంతకాలు తీసుకుని రైతులకు సంబంధం లేకుండా బ్యాంకు నుంచి రుణాలు పొంది గాయత్రీ షుగర్ ఫ్యాక్టరీ మోసానికి పాల్పడిందని అన్నారు. సుమారు 2500మంది రైతులకు చెందిన రూ.25 కోట్ల నుంచి రూ.30 కోట్ల రుణమాఫీ డబ్బులను స్వాహా చేసినట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రకాష్, సురేష్, పరమేష్, రమేష్, లింబాద్రి, కిషోర్, అంబన్న, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం పార్టీ జెండా ఆవిష్కరణ

గాంధారి, ఆగస్టు 5: గాంధారి మండలం పొతంగల్ కుర్దు గ్రామంలో సోమవారం సీపీఎం జెండాను జిల్లా కార్యవర్గ సభ్యుడు మోతీరాం నాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మోదీ పాలనలో రైతుకూలీల బతుకులు అస్తవ్యస్తమైందని అన్నారు. దేశపాలన మొత్తం కార్పొరేటర్ల చేతుల్లో వ్యవసాయంతో సహా పోయిందన్నారు. రోజురోజుకు ధరలు పెరుగుతున్న తరుణంలో మనషుల బతుకులు ఆగమైపోతున్నాయన్నారు. గిట్టుబాటు ధరలు లేక ఉన్న పంట దళారుల పాలు అవ్వడమే కాక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతూ వలసపోయే పరిస్థితి వచ్చిందని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయ కులు కిషన్‌రావు, ప్రకాష్, మధు, హనుమంత్‌రావు, సాయిలు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

పేరుకే ప్రభుత్వ జూనియర్ కళాశాల!

● ఈ యేడు 20 మంది విద్యార్థులే అడ్మిషన్ ● బోధన సిబ్బంది కరువు
● పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్నచందంగా నిజాంసాగర్‌లోని జూనియర్ కళాశాల పరిస్థితి



● నిజాంసాగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నూతన భవనంలో కొనసాగుతున్న జూనియర్ కళాశాల

నిజాంసాగర్, ఆగస్టు 5: పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా నిజాంసాగర్ జూనియర్ కళాశాల మారింది. ఈ కళాశాల 2023-24వ ఆర్థిక సంవత్సరం కళాశాలను ప్రభుత్వం మంజూరు చేసింది. కళాశాలను నిజాంసాగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నూతన భవనంలో నడిపించేందుకు జీహెచ్‌ఎస్ ఉపాధ్యాయులు అంగీకరించారు. ఏడాది క్రితం మంజూరైన కళాశాల గత యేడాది ఈ కళాశాల విద్యాభ్యాసం కోసం ఏఒక్కరు కూడా అడ్మిషన్లు పొందలేక పోయారు. బోధన సిబ్బందిని కూడా ప్రభుత్వం నియమించలేకపోయింది. కళాశాల నిర్వహణకు పక్క మండలానికి చెందిన జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఇన్‌చార్జీగా వ్యవహరిస్తున్నారు. కళాశాలకు బోధన సిబ్బంది కూడా నియమించలేక పోవడంతో కళాశాలలో అడ్మిషన్లు పొందిన 20మంది విద్యార్థులకు సిబ్బంది పక్క కళాశాల నుంచి వస్తుంటారు. విద్యార్థులు సైతం హాజరు కాలేక పోతున్నారు. కేవలం నిజాంసాగర్ పేరుకే కళాశాల, బోధనేతర సిబ్బంది ఎక్కడ అని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగం గత సంవత్సరం హుటాహుటిన కళాశాలను ప్రారంభించారు. పక్క కళాశాలలోని విద్యార్థులు ఈ కళాశాలలో అడ్మిషన్లు ఉన్నట్లు గత సంవత్సరం సూచించారు. గత సంవత్సరం ఈ కళాశాలలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులు ద్వితీయ సంవత్సరంలో విద్యాభ్యాసం చేయకపోవడం గమనార్హం. కళాశాలను పిట్లం ప్రిన్సిపాల్ విధి నిర్వహణలో ఉన్నప్పటికీ.. కళాశాలకు రాలేకపోతున్నారు. అయితే, జూనియర్ అసిస్టెంటే ఈ కళాశాలకు వస్తూనే ఉన్నారు. కానీ ప్రస్తుతం విద్యార్థులు లేక వెలవెలబోతున్నాయి. నిజాంసాగర్‌లో ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూసిన కళాశాల ఎట్టకేలకు గత తెలంగాణ ప్రభుత్వం ఈ కళాశాలను మంజూరు చేసింది.

ఈ కళాశాల భవన నిర్మాణం కోసం స్థలాన్ని కూడా ఆదర్శ పాఠశాల సమీపంలో కేటాయించారు. కళాశాల నిర్మాణం మాటే గానీ కళాశాలలో విద్యార్థులు లేకపోవడం గమనార్హం. ఈ కళాశాల ప్రారంభమై రెండు సంవత్సరాలు గడుస్తున్నా.. కళాశాలలో అడ్మిషన్లు పొందేందుకు విద్యార్థులు ముందుకు రావడం లేదు. అచ్చంపేట, నిజాంసాగర్, మల్లూర్, మహ్మద్‌నగర్, కోమలంచ, గాలిపూర్, సింగీతం తదితర గ్రామాలు, ఎల్లారెడ్డి మండల పరిధిలోని అన్నాసాగర్ ఉన్నత పాఠశాలలో దాదాపు 400 మంది విద్యార్థులు. అలాగే కస్తూర్బా, మోడల్ స్కూళ్లలో దాదాపు 500 మంది విద్యార్థినీ, విద్యార్థులు పదో తరగతిలో విద్యాభ్యాసం చేస్తుంటారు. అదేవిధంగా ఈ పాఠశాలల ప్రత్యేకాధికారులు, ప్రధానోపాధ్యాయులు స్థానిక నిజాంసాగర్ జూనియర్ కళాశాలలో పదవ తరగతి ముగియగానే అడ్మిషన్లు పొందాలని అవగాహన చేయకపోవడంతో కళాశాలలో అడ్మిషన్లు పొందేందుకు విద్యార్థినీ, విద్యార్థులు ముందుకు రాకపోవడం పట్ల అవగాహనలేమి కొట్టొచ్చినట్లు కనబడుతుంది. అధికార యంత్రాంగం వొకేషనల్ కోర్సు ప్రారంభిస్తే విద్యార్థుల శాతం పెరుగనుందని స్థానికులు అంటున్నారు.



భిక్కనూరు స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



బీర్కూర్ జోడు లింగేశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

భక్తులతో కిటకిటలాడిన సిద్ధరామేశ్వర ఆలయం

● శ్రావణ మొదటి సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు

భిక్కనూరు, ఆగస్టు 5: మండలకేంద్రంలోని దక్షిణకాశీగా బాసిల్లుతున్న సిద్ధరామేశ్వర ఆలయం శ్రావణమాస ప్రారంభ మొదటి సోమవారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి జిల్లా నలుమూలల నుంచే కాకుండా.. ఇతర జిల్లాల నుంచి ఆలయానికి చేరుకుని క్యూలో నిలబడి స్వామివారిని దర్శించుకుని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. శ్రావణమాస ప్రత్యేక పూజల్లో బాగంగా స్వామివారిని తీరొక్కపూలతో అంకరించి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ మేరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. కాగా మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

దోమకొండ: మండల కేంద్రంలోని శివరాం మందిర్ ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా సోమవారం స్థానిక మహిళలు పవిత్ర జలాలను తీసుకునివచ్చి జలాభిషేకం చేశారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం మొదటిరోజు సందర్భంగా ఆలయాల్లో భక్తుల తాకిడి పెరిగింది. మహిళలు ఉపవాసాలతో మొక్కుల చెల్లించుకున్నారు. ఇందులో ఈవో ప్రభు, అర్చకులు శర్మ, ఏ.రాజేందర్, అంజం, పోచయ్య, తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుంద: శ్రావణమాసం ప్రారంభం కావడంతో శివాలయాల్లో భక్తుల రద్దీ పెరిగింది. మండల కేంద్రంలోని కాశీ విశ్వనాథ్ శివాలయం, చెట్ల కోటి ఈరన్న శివాలయం, కందర్‌పల్లిలో సిద్ధేశ్వర శివాలయం, పుల్కల్‌లో సర్వేశ్వర శివాలయం, వాజిద్‌నగర్‌లో విశ్వనాథ శివాలయాలలో ఉదయం నుంచే భక్తులు శివలింగానికి పాలాభిషేకం నిర్వహించి మొక్కలు చెల్లించుకున్నారు. శివాలయాలకు వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.



దోమకొండలో పవిత్ర జలాలను తీసుకువస్తున్న మహిళలు

● జోడు లింగేశ్వరాలయంలో భక్తుల పూజలు

బీర్కూర్: హిందువులు ఎంతో పవిత్రంగా భావించే శ్రావణ మాసం సోమవారం ప్రారంభమైంది. తొలి సోమవారం కావడంతో ఆలయాలు భక్తుల తాకిడితో కిటకిటలాడాయి. బీర్కూర్ మండల కేంద్రంలోనరి జోడు లింగేశ్వర ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈనెలలో పండుగలు, వివాహాది శుభకార్యాలు పెద్దఎత్తున ఉంటాయి.



సౌత్ క్యాంపస్‌లో నివాళులు అర్పిస్తున్న దృశ్యం

ప్రీతమ్ కుటుంబానికి అండగా ఉంటాం

● తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరి

భిక్కనూరు, ఆగస్టు 5: కామారెడ్డి జిల్లాకేంద్రంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన భిక్కనూరు మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో గల తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్ రెండవ సంవత్సరం విద్యార్థి ప్రీతమ్ కుటుంబానికి అన్నివిధాలుగా అండగా ఉంటామని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరి అన్నారు. సోమవారం సౌత్‌క్యాంపస్‌లో ప్రీతమ్ సంతాపసభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు రిజిస్ట్రార్, సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్, సిబ్బంది, విద్యార్థులు ప్రీతమ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ మాట్లాడుతూ ప్రీతమ్ విద్యపట్ల ఎంతో శ్రద్ధ కలిగిన విద్యార్థి అని, ఆయన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తట్టుకోలేకపోతున్నామని అన్నారు. యూనివర్సిటీ తరుపున ప్రీతమ్ కుటుంబానికి అండగా నిలబడతామని, విద్యార్థులు బయటకు వెళ్లిన సమయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రీతమ్ మరణానికి కారణమైన ఆటో డ్రైవర్‌ను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

14.5 అడుగులకు పోచారం నీటిమట్టం



ప్రాజెక్టులో నీటిమట్టం

నాగిరెడ్డిపేట, ఆగస్టు 5: పోచారం ప్రాజెక్టు నీటిమట్టం 14.5 అడుగులకు చేరుకుంది. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా పోచారం ప్రాజెక్టులోకి వరదనీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టులో నీటిమట్టం పెరుగుతోంది. ప్రాజెక్టులో నీటిమట్టం పెరుగుతుండటంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పోచారం ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల కారణంగా లింగంపేట, గుండారం వాగుల ద్వారా ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టులో నీటిమట్టం రోజురోజుకు పెరుగుతుంది. సోమవారం వరకు ప్రాజెక్టులోకి 14.5 అడుగుల నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 1.820 టీఎంసీలకు గాను.. ప్రస్తుతం 0.954 టీఎంసీల నీరు వచ్చి చేరింది. కాగా, ప్రాజెక్టులోకి 200 క్యూసెకులు ఇన్‌ఫ్లో వస్తున్నట్లు ఎల్లారెడ్డి నీటి పారుదల శాఖ డీఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు.

విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి

నిజాంసాగర్, ఆగస్టు 5: విద్యార్థులు సెల్‌పోన్లకు దూరంగా ఉండాలని జిల్లా పీఎస్ ఫోరం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. సోమవారం నిజాంసాగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆధునిక టెక్నాలజీ కాలంలో సెల్‌ఫోన్ వినియోగం పెరిగిందన్నారు. సైబర్ నేరాలు పెరిగిపోయాయని, అనవసర మెసెజ్‌లు, లింకులను ఓపెన్ చేయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ దయానంద్, సీఈవో అశోక్ వర్ధన్, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీ రామచంద్ర, పీఈటీ ఉపాధ్యాయులు వెంకట్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మల్లికార్జున్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆలోచన విధానానికి అనుగుణంగా మందకృష్ణ పని చేస్తున్నారు

● ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్ రాములు

కామారెడ్డి టౌన్, ఆగస్టు 5: అంబేద్కర్ ఆలోచన విధానంకు అను గుణంగా మంద కృష్ణమాదిగ పనిచేసున్నారని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి బట్ట వెంకట్ రాములు అన్నారు. సోమవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయవతి అంబేద్కర్ కన్న కలలకు తూట్లు పోడిచేవిధంగా మాట్లాడడం సరికాదని అన్నారు. సుప్రీంకోర్టు వర్గికరణ అంశాన్ని సమర్థించినప్పటికీ.. కొందరు మాలలు పనికట్టుకొని మందకృష్ణ మాదిగపై అవాకులు చెవాకులు మాట్లాడుతున్నారని అన్నారు. ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో జరుగుతున్నటువంటి సంబరాలు జరుపుకోవడం కొందరికి ఇష్టం లేనట్టుందని, అందుకే వ్యతిరేకంగా ప్రకటనలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీ, నాయకులు యాదయ్య, రాంరెడ్డి, రాజనర్సయ్య, రమేష్, లావణ్య, మహేశ్వరి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై ఫిర్యాదులు తప్ప.. ఏమీ చేయలేకపోతున్నారు

● ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ

కామారెడ్డి టౌన్, ఆగస్టు 5: కామారెడ్డిలో జరుగుతున్న అభివృద్ధిపై విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదులు చేయడం తప్ప ఏమీ చేయలేకపోతున్నారని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ అన్నారు. సోమవారం 75వ వన మహోత్సవంలో భాగంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కామారెడ్డి ఎన్నికల్లో పోటీ చేయకున్న కూడా పుట్టినగడ్డపై ఉన్న ప్రేమతో అభివృద్ధికి కృషి చేస్తున్నానని అన్నారు. అభివృద్ధిలో పోటీ పడాలే తప్ప.. అభివృద్ధిని అడ్డుకోవడంలో కొందరు పోటీ పడుతున్నారని అన్నారు. సొంత నిధులతో అభివృద్ధి చేస్తామని గాలిమాటలతో డబ్బాలు కొట్టి ప్రభుత్వం నుంచి చేపట్టే అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారని అన్నారు. దంచికొట్టె ఉపన్యాసాలు తప్ప ప్రజలకు ఉపయోగపడే పనులు ఏమీ జరగడం లేదని, గాలిమాటలు నీటిమూటలుగా మారుతున్నాయని అన్నారు. నియోజకవర్గంలో పని చేయడానికి అధికారులు ఎవరు ముందుకు రావడం లేదని ఇక్కడ పని చేస్తున్న అధికారులు వేరే దిక్కు వెళ్లిపోతున్నారని తెలిపారు. ప్రతీఒక్కరు చెట్లను నాటాలని నాటిన చెట్లను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందని అన్నారు. భవిష్యత్తు తరాలకు మంచి ఆక్సిజన్ అందాలంటే ప్రతీ ఒక్కరు చెట్లను నాటాలని అన్నారు. అదేవిధంగా కామారెడ్డి పట్టణానికి ప్రత్యేక నిధుల ద్వారా రూ.240 కోట్ల వ్యయంతో జలాల్‌పూర్ నుంచి మల్లన్నగుట్ట వరకు తాగునీరు పైప్‌లైన్‌కు నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. కామారెడ్డి మున్సిపాలిటికి అమృత్ స్కీం కింద రూ.93 కోట్ల పనులకు టెండర్లు పూర్తయ్యాయని పట్టణాన్ని స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయడమే నా లక్ష్యమని అన్నారు. కామారెడ్డి నియోజకవర్గానికి సాగునీటి కోసం ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్ట్ పథకం కింద రూ.1200 కోట్లు అవసరముండగా.. సీఎం రేవంత్‌రెడ్డి రూ.200 కోట్లు మంజూరు చేశారని, దీని ద్వారా 2,54,000 ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. అంతేకాకుండా కామారెడ్డి పట్టణంలో కరెంటు సమస్య లేకుండా తీర్చడం కోసం త్వరలోనే కామారెడ్డి పట్టణానికి ప్రత్యేక నిధుల ద్వారా 33/11కేవీ సబ్‌స్టేషన్ మంజూరు చేయిస్తానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియచంద్రశేఖర్‌రెడ్డి, కమిషనర్ సుజాత, కౌన్సిలర్ పాక జ్ఞానేశ్వరి, పాత శివకృష్ణమూర్తి, కన్నయ్య, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ

● సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కామారెడ్డి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ప్రభుత్వ సలహదారుడు షబ్బీర్‌అలీ సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్‌ఎఫ్ ఫైళ్లను సీఎంతో మాట్లాడి కామారెడ్డి నియోజకవర్గంలో దాదాపు 300మందికి మంజూరు చేయించానని తెలిపారు. ఎవరూ వాటిని పంచారనేది ముఖ్యం కాదని ఎవరు మంజూరు చేయించారనేది ముఖ్యమన్నారు. మేము బేషజాలకు వెళ్లమని పేదలకు సహాయంగా ఉంటూ ప్రజల మంచి మాత్రమే కోరుకుంటామన్నారు. అలాగే రుణమాఫీపై పిర్యాదులు వస్తున్నాయని కోఆపరేటివ్ సొసైటీ బ్యాంకుల్లో పోడు భూముల అసైన్‌మెంట్ భూములపై రుణాలు రద్దు కాలేదని అంటున్నారని తెలిపారు.

రోడ్డు దాటుతుండగా బైకు ఢీ : వృద్ధురాలి మృతి

లింగంపేట, ఆగస్టు 5: మండల కేంద్రంలోని ఎల్లారెడ్డి-కామారెడ్డి రహదారిపై సోమవారం రాత్రి రోడ్డు దాటుతుండగా అతివేగంగా వచ్చిన బైకు వృద్ధురాలిని ఢీకొనడంతో సదాశివనగర్ మండలంలోని ధర్మారావుపేటకు చెందిన రెడ్డిగారి చిన్నమ్మ(65) అక్కడికి అక్కడే మృతి చెందినట్లు ఎస్సై చైతన్య కుమార్‌రెడ్డి తెలిపారు. తాడ్వాయి మండలంలోని కన్‌కల్ గ్రామానికి చెందిన తన కూతురు సరసని సుజాత లింగంపేటలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోందని, ఆమెను చూడడానికి వచ్చినట్లు ఎస్సై తెలిపారు. కూతురు కోసం టీ తీసుకురావడానికి పక్కనే హోటల్‌కు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా.. ద్విచక్ర వాహనంపై అతివేగంగా వచ్చిన మండల కేంద్రానికి చెందిన మక్కుల అనిల్ అనే యువకుడు చిన్నమ్మను ఢీ కొనడంతో ఎగిరి పడి తీవ్రగాయాలయి. దీంతో అక్కడికి అక్కడే మృతి చెందినట్లు ఆయన తెలిపారు. ప్రమాదానికి కారణమైన అనిల్ అక్కడి నుంచి పారిపోయినట్లు ఆయన ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

బాన్సువాడ, ఆగస్టు 5: భిక్కనూరు మండలంలోని బస్వాపూర్ గ్రామశివారులో రైలు పట్టాల సమీపంలో 2021లో జరిగిన హత్య కేసులో నిందితుడికి జిల్లా రెండవ అదనపు సెషన్ కోర్టు జడ్జీ శ్రీనివాస్ సోమవారం జీవితఖైదుతో పాటుగా రూ.2వేల జరిమానా విధించినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. మెదక్ జిల్లా ఝాన్సీలింగాపూర్ గ్రామానికి చెందిన తుడుం రాకేష్(23) వద్ద సెల్‌ఫోన్ కొనుగోలు చేసిన మహ్మద్ ఇమ్రాన్ అనే వ్యక్తి మృతుడి బైక్‌ను సొంతం చేసుకోవాలన్న దురుద్దేశంతో మద్యం తాగించి కర్రతో, బండరాయిలో తలపై కొట్టి హత్యచేయ్యగా, సాక్షాదారాలను పరిశీలించి నిందితుడికి జీవిత ఖైదును విధించినట్లు ఎస్సై తెలిపారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి	- ఓసీ
దర్శన్	- శివంభజే
ప్రియా 70	- కల్కి
ప్రియా 35	- రాయన్, బడ్డి

బాన్సువాడ

మహేశ్వరి	- రాయన్
వేంకటేశ్వర	- పురుషోత్తముడు

చికెన్ ధరలు

రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	170	220	230